క్లుప్తంగా

పాఠశాల తనిఖీ



స్కూలులో పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజ, ఎంఈఓ శివరత్నమ్మ

సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ కలమందలవారిపల్లె ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజ తనిఖీ చేశారు. శనివారం రాత్రి పాఠశాలలో నల్లమందు పేలుళ్ల సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఎంఈఓలు, మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులను అప్రమత్తం చేశారు. పాఠశాల పనివేళల అనంతరం ఇతరులెవరూ స్కూళ్ల ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమన్వయంతో వలంటీర్ల ద్వారా రోజూ సాయంత్రం తనిఖీ చేయాలని, తద్వారా ఎవరూ లోనికి రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 శివరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి మణికుమార్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాల, కలమందలవారిపల్లె, కొత్తూరు ప్రాథమిక పాఠశాలలో 2వ విడతలో చేస్తున్న నాడు-నేడు పనులను మంగళవారం ఎంఈఓ శివరత్నమ్మ పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బోనమంద, రెడ్డివారిపల్లెలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

నాణ్యమైన విద్యాబోధనతో ఉత్తమ పౌరులు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీరాములు

సోమల: ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్యాబోధనతో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు శ్రీరాములు, శివరత్నమ్మ కోరారు. మంగళవారం సోమల, పెద్ద ఉప్పరపల్లె ఉన్నత పాఠశాలల్లో సీఆర్పీ సమావేశాలు నిర్వహించారు. ఆ సమావేశాల్లో ఎంఈఓలు మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీ హెచ్ఎంలు తుంగా నాగరాజ, భాస్కర్ పాల్గొన్నారు.

అప్పినపల్లె జెడ్పీ హైస్కూలులో..



సమావేశంలో జెడ్పీ సీఈఓ

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూలులో మంగళవారం క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయుల సమావేశాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించే దిశగా విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నందకుమార్, సీఆర్పీ రమేష్, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ



అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న దాతలు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్న 25మంది పిల్లలకు పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య, రఘు మంగళవారం ఖర్జూరం, రాగిజావ, నువ్వుల చిక్కీలు మొదలైన వాటితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్ నజ్మా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ రెడ్డెప్ప(55) మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం చిప్పిలివారిపల్లెలో రెడ్డెప్ప భౌతిక కాయానికి పూలమాల ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. సోమల మల్లికార్జునరెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్, నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, వేమన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయితో తీపి లాభాలు!

- పడమటి మండలాల్లో ఆసక్తిని చూపుతున్న రైతాంగం
- పంట వచ్చిన పదినెలల వరకూ కోతలు
- నికర ఆదాయం గడిస్తున్న రైతులు
- తోటలవద్దే కొంటున్న ఢిల్లీ, చెన్నై వ్యాపారులు
- రైతులకు తప్పిన రవాణా, మార్కెటింగ్ ఇబ్బందులు



చీలంపల్లె సమీపంలో సాగు చేసిన రెడ్ లేడీ రకం హైబ్రిడ్ బొప్పాయి

పలమనేరు: జిల్లాలోని పడమటి మండలాల రైతులు బొప్పాయి సాగుతో మంచి ఆదాయం పొందుతున్నారు. తక్కువ నీటితో, పెద్దగా పురుగుల మందులతో అవసరం లేకపోవడానికి తోడు ధరలు ఆశాజనకంగా ఉండడంతో నికర ఆదాయం గడిస్తున్నారు. దీంతో మెట్ట ప్రాంతాల రైతులు బొప్పాయి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది నాటిన తోటలు ప్రస్తుతం పలమనేరు ఉద్యానశాఖ డివిజన్‌లో 400 ఎకరాల్లో ఉన్నాయి. అక్టోబర్‌లో బొప్పాయి సాగు సీజన్ మొదలవుతుంది. దీంతో ఈ పర్యాయం సాగు విస్తీర్ణం 600 ఎకరాల వరకూ ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

బాగా పండితే ఎకరాకు 30 టన్నుల దిగుబడి

ఎకరా పొలంలో 800 బొప్పాయి మొక్కలు నాటుకోవాలి. డ్రిప్ ఉన్న రైతులకు బొప్పాయి సాగు సులభంగా ఉంటుంది. మొక్కల చుట్టూ సేంద్రియ ఎరువులు వేయాలి. నాటిన ఆరో నెల నుంచి కోత ప్రారంభమవుతుంది. ఆపై పదినెలలు వరకూ పంట కాలం ఉంటుంది. నెలకు మూడు కోతలు కోసుకోవచ్చు. పంట కాలం పూర్తయ్యేలోపు ఎకరాకు సుమారు 30 నుంచి 40 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలోని రైతులు హైబ్రిడ్ రకమైన థైవాన్ రెడ్ లేడీ మొక్కలను నాటుతున్నారు. ప్రస్తుతం ప్రైవేటు నర్సరీలో ఓ మొక్క రూ.15గా ఉంది. ఎకరా పొలంలో సాగుకు అన్ని ఖర్చులు కలిపి రూ.1.5 లక్షలదాకా అవుతుంది. ఎకరాకు 30 టన్నులు దిగుబడి వచ్చినా ప్రస్తుత ధర టన్ను రూ.16 వేల మేరకు రూ.5.40లక్షలు రాబడి ఉంటుంది. ఇందులో పంట పెట్టుబడి రూ.1.50లక్షలు పోను రైతుకు రూ.3.90 లక్షల దాకా మిగిలే అవకాశం ఉంటుంది.

మార్కెటింగ్‌కు ఇబ్బందుల్లేవ్

సాధారణంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి. కానీ బొప్పాయిని మాత్రం ఢిల్లీ, చెన్నైకు చెందిన వ్యాపారస్తులు రైతుల పొలం వద్దనే కొనుగోలు చేసి, వారి కూలీలతోనే కటింగ్ చేసి, వారి వాహనాల్లోనే ఢిల్లీతోపాటు డిమాండ్ ఉన్న రాష్ట్రాలకు పంపుతున్నారు. దీంతో స్థానిక రైతులకు మార్కెటింగ్ బాధ తప్పడంతో పాటు ఖర్చులు ఆదా అవుతున్నాయి. అనంతపురం, కడప జిల్లాలకు చెందిన కూలీలు ఇక్కడికి వచ్చి బొప్పాయిని ప్యాకింగ్ మొదలు లోడింగ్ వరకూ పనులన్నీ వారే చేస్తున్నారు.

నికర ఆదాయం



నేను పదేళ్లుగా బొప్పాయి సాగు చేస్తున్నా. ప్రస్తుతం రెండున్నర ఎకరాల్లో పంట ఉంది. నీళ్లు తక్కువగా ఉన్న మెట్ట ప్రాంతాల్లో సాగు చేయడానికి బొప్పాయి అనుకూలం. ప్రస్తుతం టన్ను ధర రూ.16 నుంచి 18వేల దాకా ఉంది. పంట దిగుబడి బాగొస్తే మంచి ఆదాయం వస్తుంది. చిన్న సన్నకారు రైతులకు బొప్పాయి సాగు చేయడం మేలు. **–శేషగౌడు, బొప్పాయి రైతు, చీలంపల్లె, బైరెడ్డిపల్లె మండలం**

బొప్పాయి సాగు మరింత పెంచాలి



ఈ ప్రాంతం బొప్పాయిసాగుకు అనుకూలంగా ఉంటుంది. 18 నెలల పంటకాలంగా ఉంటుంది. నాటిన ఎనిమిదో నెలనుంచి పంట దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి కాబట్టి రైతులకు నష్టం వచ్చే అవకాశం తక్కువ. ఇక్కడి రైతులు బొప్పాయి సాగు పెంచేలా కృషి చేస్తున్నాం. **–డాక్టర్ కోటేశ్వర్‌రావు, ఉద్యానశాఖ సహాయ సంచాలకులు**

ఇక లోఓల్టేజి సమస్య తీరినట్లే!



కేవీ కొత్త లైన్లను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ క్రిష్ణారెడ్డి

- ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్పింగ్ ఉండదు
- 220 కేవీ లైన్లతో మెరుగైన కరెంట్
- రెండు కొత్త లైన్లను ప్రారంభించిన ట్రాన్స్‌కో ఎస్ఈ క్రిష్ణారెడ్డి

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్‌లోని గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లోని ఏడు సబ్‌స్టేషన్ల పరిధిలో రైతులకు లో ఓల్టేజి సమస్య తీరినట్లేనని ట్రాన్స్‌కో ఎస్ఈ(ఆపరేషన్) క్రిష్ణారెడ్డి తెలిపారు. పలమనేరులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో గంగవరం, బైరెడ్డిపల్లె మండలాలకు కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో లోఓల్టేజీ కారణంగా రెండు మండలాల్లోని టెయిల్ ఎండ్‌లోని వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోవడం, ట్రిప్ కావడం, ఫ్యూజులు, రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు కాలడం లాంటి సమస్యలుండేవన్నారు. దీంతో పలమనేరు నుంచి 220 ప్రత్యేక లైన్లను గంగవరం, బైరెడ్డిపల్లె మండలాలకు ఏర్పాటు చేశామన్నారు. ఫలితంగా ఇక్కడి ఏడు సబ్‌స్టేషన్లలో ఇకపై హై ఓల్టేజి కరెంట్ సరఫరా అవుతుందని, రైతులకు, గృహ వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలుండవని చెప్పారు. ముఖ్యంగా ఓవర్‌లోడ్ సమస్య పరిష్కారమైనట్టేనన్నారు. కార్యక్రమంలో పలమనేరు ట్రాన్స్‌కో ఏఈ చిన్నబ్బ, ఈఈలు నాగేశ్వరావు, సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

పలమనేరు: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 28న స్థానిక ఎక్సైజ్‌స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ ఎల్లయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఆధార్‌కార్డుతో వేలానికి హాజరై, నిర్ణయించిన సొమ్మును చెల్లించి పాల్గొనాలన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడా దుస్తులతో నంజంపేట విద్యార్థులు

సోమల: మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి(యుకే) పాఠశాల విద్యార్థుల కోసం రూ.15 వేల విలువ చేసే క్రీడా దుస్తులను వితరణ చేశారు. వీటిని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గోపీ నాయక్, మునీశ్వర, ఉప సర్పంచ్ ముబారక్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కుసుమాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!



కోనేటిరాయునికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

గంగవరం: శ్రవణా నక్షత్రం సందర్భంగా మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటిరాయస్వామిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరయ్యారు. అనంతరం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

ఘనంగా జెడ్పీ చైర్మన్ జన్మదిన వేడుకలు



జెడ్పీ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వి.కోట: జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు జన్మదినం పురస్కరించుకుని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఉమ్మడి జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు మంగళవారం స్థానిక జెడ్పీ చైర్మన్ నివాసంలో పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభినందన సభ ఏర్పాటు చేసి ఆయన్ను సన్మానించారు. ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కళాశాల, హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 255 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అలాగే 45 మంది రక్తదానం చేశారు. అంతేకాక జెడ్పీ నివాసం వద్దకు వచ్చిన వారందరికీ వివిధ మొక్కలను పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. తొలుత భారీ కేక్‌ను జెడ్పీ చైర్మన్ కట్ చేశారు. కలిసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన వారిలో కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఎంపీపీ యువరాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, ఎంపీపీలు, పలువురు వైద్యాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు ఉన్నారు.

నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీలో విన్నర్స్‌గా నిలిచిన సీనియర్ బాలికల జట్టు



విన్నర్స్‌గా నిలిచిన జూనియర్ బాలికల జట్టు



విన్నర్స్‌గా నిలిచిన సీనియర్ బాలుర జట్టు

పలమనేరు: స్కూల్ గేమ్స్‌లో భాగంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు మండలంలోని కొలమాసనపల్లె హైస్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలురు, బాలికల విభాగంలో ఈ పోటీలను హెచ్ఎం ఈశ్వరప్రసాద్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, రత్నా బయోటెక్ అధినేత గంగిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ హరినాయుడు హాజరై మాట్లాడారు. సీనియర్ బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కొలమాసనపల్లె, కల్లుపల్లె, జూనియర్ బాలుర విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లె, కొలమాసనపల్లె విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. ఇక సీనియర్ బాలికల విభాగంలో జెడ్పీహెచ్ఎస్ కొలమాసనపల్లె, దొడ్డిపల్లె, జూనియర్స్ విభాగంలో వీ.కోట, కొలమాసనపల్లె జట్లు విన్నర్స్, రన్నర్స్ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్ల క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేయండి



సోమల : సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి

సోమల/సదుం: మండలంలో ఈ నెల 29 శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కోరారు. మంత్రి పర్యటనపై మంగళవారం సోమల, సదుం మండల కేంద్రాల్లో ఆయన అధికారులు, పార్టీ నాయకులతో సమీక్షించారు. మంత్రి పర్యటించే రూట్ మ్యాప్‌ను ప్రకటించారు. పలు ప్రారంభోత్సవాలను మంత్రి చేస్తారని తెలిపారు. సమావేశంలో సోమల ఎంపీపీ ఈశ్వరయ్య, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్ బాషా, ఎంపీడీఓలు నాగరాజ, వరప్రసాద్, సదుం జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, పుంగనూరు రూరల్ సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ వెంకట నరసింహులు, ఏపీఎం శివయ్య, సోమల మండల పార్టీ కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, పార్టీ నేతలు సాంబయ్య, రమణ, రాజారెడ్డి, సదుం నాయకులు రెడ్డెప్పరెడ్డి, ఇమ్రాన్, శివారెడ్డి, పుత్రాజు, గిరిధర్ రెడ్డి, నారాయణరెడ్డి, వెంకటస్వామి, రమేష్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

28న 26 ప్రారంభోత్సవాలు



పుంగనూరు : మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 28న మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు జింకావెంకటాచలపతి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మండల సచివాలయల కన్వీనర్ చెంగారెడ్డితో తదితరులతో కలిసి మంత్రి పర్యటన విషయమై సమావేశం నిర్వహించి ఎంపీపీ మాట్లాడారు. మండలంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వాటర్‌ప్లాంట్లు, వాటర్‌షెడ్లు, వైఎస్సార్ హెల్త్ సెంటర్లను మంత్రి 28 ఉదయం నుంచి ప్రారంభిస్తారన్నారు. మొత్తం 26 ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. దీనిని అందరూ విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి , చంద్రారెడ్డియాదవ్, రమణ, ప్రభాకర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నంజుండప్ప, శంకరప్ప, బాలచంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న మెడికలాఫీసర్ పుష్పకుమారి

సదుం: స్థానిక సీహెచ్‌సీలో ఆయష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యశిబిరం నిర్వహించి, రోగులు వైద్య పరీక్షలు చేశారు. మెడికలాఫీసర్ డాక్టర్ పుష్పకుమారి మాట్లాడుతూ, మెరుగైన వైద్యసేవలు అందించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిబిరంలో పలు రకాల రోగాలకు చికిత్స చేయనున్నట్టు చెప్పారు. అనంతరం 360 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సభ్యులు రమాదేవి, మురళి, డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

లక్కనపల్లెలో ఇంటింటా వైద్య పరీక్షలు



బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెలో..

పలమనేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లె పంచాయతీలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఆయా కుటుంబాల్లోని అందరికీ వైద్యపరీక్షలు చేసి వారి ఆరోగ్యం ఎలా ఉందో వివరాలు నమోదు చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి త్వరలో నిర్వహించనున్న వైద్య శిబిరంలో చికిత్స అందిస్తామని చెప్పారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రాజశేఖర్

పుంగనూరు: విద్యతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ అన్నారు. ఇటీవల గుంటూరులో ఖేలో ఇండియా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందిన కళాశాల విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపల్ అభినందించారు. కళాశాల విద్యార్థిని జయలక్ష్మి పరుగు పందెంలో ద్వితీయ స్థానాన్ని , లాంగ్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే హేమశ్రీ , కళ్యాణి, దామోదర్ తదితర విద్యార్థులు సత్తా చాటినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామ్‌కుమార్, అనిల్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఇద్దరి ఎంపిక



చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పీఈటీ

పెద్దపంజాణి: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడలకు సంబంధించి తమ స్కూలు క్రీడాకారిణులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు డి.నందకుమార్, పీఈటీ కేఎన్.ఉదయ్‌కుమార్ తెలిపారు. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగ ఉన్నత పాఠశాలలో సెలెక్షన్స్ నిర్వహించి అండర్-14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారని, తమ స్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.భావన అండర్-17 బాలికల విభాగంలో, కె.కవిత అండర్-14 విభాగంలో ప్రతిభ చాటి ఎంపికయ్యారని తెలియజేశారు.

● నిమజ్జనం



సదుం: ఊరేగుతున్న వినాయకస్వామి

కుప్పం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేషుని ప్రతిమలను తొమ్మిదవ రోజు మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు. పట్టణంలోని కొత్తపేట, తంబిగానిపల్లె కోటాలు వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని పట్టణ వీధుల్లో పలక వాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ కోలాహలంగా యువత ఊరేగించింది. అనంతరం వీరప్పనాయన చెరువులో నిమజ్జనం చేశారు.

సదుంలో..

సదుం: స్థానిక అరవపాలెంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో మేళ తాళాలతో ఊరేగించారు. మహిళలు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.



కుప్పం : నిమజ్జనానికి తరలుతున్న వినాయకు ప్రతిమ